క్లుప్తంగా

వైద్య శిబిరానికి విశేష స్పందన



తనిఖీ చేయించుకుంటున్న వైస్ ఎంపీపీ అచ్చెన్నాయుడు

రేగిడి: మండలంలోని చిన్నశిర్లాం గ్రామంలో సోమవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వివిధ అనారోగ్య సమస్యలతో శిబిరానికి హాజరైన వారికి విశాఖపట్నానికి చెందిన మహాత్మాగాంధీ ఆస్పత్రి వైద్యులు సుభద్ర, సుధానంద్, సుకన్యలు వైద్య తనిఖీలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. అలాగే ఆరోగ్య సలహాలు, సూచనలు ఇచ్చారు. అలాగే కేన్సర్ మహమ్మారి బారినపడకుండా ఉండేందుకు పాటించాల్సిన జాగ్రత్తలు, ఆహార నియమాలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ టంకాల ఉమాపాపినాయుడు తదితరులు పాల్గొన్నారు.

మద్యంసీసాల స్వాధీనం



పట్టుబడిన మద్యంసీసాలను చూపిస్తున్న ఏఎస్‌ఐ భాస్కరరావు

బొబ్బిలి: మున్సిపాలిటీ పరిధిలోని బైపాస్ రోడ్డులో దాడితల్లి కోవెల వద్ద అక్రమంగా తరలిస్తున్న 28 మద్యంసీసాలను పోలీసులు సోమవారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి, గొల్లపల్లిలోని పైల వీధికి చెందిన వాండ్రాసి సత్యనారాయణ అనే వ్యక్తిని పట్టుకుని అరెస్ట్ చేసినట్లు ఏఎస్‌ఐ భాస్కరరావు తెలిపారు.

వంగర: మండలంలోని సంగాం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి సారాతో పట్టుబడినట్లు ఎస్‌ఐ షేక్ శంకర్ తెలిపారు. గ్రామంలో సోమవారం పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించగా, ఆ వ్యక్తి నుంచి ఆరు లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, ఆ వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు.

టీడీఆర్ బాండ్ల జారీపై విజిలెన్స్ విచారణ



నిర్వాసితుల ఇళ్ల వద్ద వివరాలపై ఆరాతీస్తున్న అధికారులు

బొబ్బిలి: పట్టణ ప్రధాన రహదారి విస్తరణలో ఇళ్లను కోల్పోయిన నిర్వాసితులకు జారీ చేసిన టీడీఆర్ బాండ్ల జారీపై విజిలెన్స్ అధికారులు సోమవారం విచారణ చేపట్టారు. విజిలెన్స్ అధికారులతో పాటు మున్సిపల్, పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు నిర్వాసితుల వద్దకు వెళ్లి, రోడ్డు విస్తరణ సమయంలో కోల్పోయిన ఇంటి విస్తీర్ణం, జారీ చేసిన బాండు విలువ ఎంత అనే విషయాలపై ఆరాతీశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ తరహా బాండ్లపై విచారణ జరుగుతోందని, అందులో భాగంగానే ఈ విచారణ జరుగుతోందని సీఐ బి.సింహాచలం తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డీఈఈ జి.ప్రేమ్‌కుమార్, టీపీవో రేవతి, మున్సిపల్ ఆర్‌ఐ పి.సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులపై ఆరా

రేగిడి: మండలంలోని లచ్చారాయపురం, జాడపేట, నాయిరాలవలస గ్రామాల్లో మండల పరిషత్ ప్రత్యేకాధికారి ఎ.కల్యాణచక్రవర్తి సోమవారం పర్యటించి, అక్కడి పారిశుధ్య పనులపై ఆరాతీశారు. రోడ్లు, వీధులను ఎలా పరిశుభ్రంగా ఉంచుతున్నారు.. రక్షిత మంచి నీటి పథకాల్లో ఏ విధంగా పరిశుభ్రతా చర్యలు చేపడుతున్నారన్న విషయాలను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు సీజనల్ వ్యాధుల బారినపడకుండా, ఆరోగ్య జాగ్రత్తలు పాటించేలా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జి.శ్యామలాకుమారి, ఈఓపీఆర్డీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యాన్ని సద్వినియోగం చేసుకోండి



ర్యాలీలో ఆయుర్వేద వైద్యాధికారి సునీల్‌కుమార్, విద్యార్థులు

రేగిడి: ప్రతిఒక్కరూ అందుబాటులోని ఆయుర్వేద వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని ఖండ్యాం ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి వైద్యుడు సునీల్‌కుమార్ కోరారు. జాతీయ ఆయుర్వేద వైద్య వారోత్సవాల్లో భాగంగా మండలంలోని ఖండ్యాం గ్రామంలో విద్యార్థులతో కలిసి సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఆయుర్వేద వైద్యం దీర్ఘకాలిక రోగాల నుంచి ఉపశమనం కలిగిస్తుందని, రోగ నిరోధక శక్తిని పెంచుతుందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నాగభూషణదొర తదితరులు పాల్గొన్నారు.

- మెంతిపేటలో వాటర్ ప్యూరిఫయర్ ప్లాంట్ నిర్మాణానికి సన్నాహాలు
- ప్రణాళికలు సిద్ధం చేసిన మున్సిపల్ అధికారులు
- నోటీసులు ఇవ్వకుండా నీటిశుద్ధి కర్మాగారం పనులపై రైతుల ఆందోళన
- తమ భూములు లాక్కుంటే ఊరుకోమని కలెక్టర్‌కు ఫిర్యాదు
- అవసరమైతే కోర్టును ఆశ్రయిస్తామని స్పష్టీకరణ



జనావాసాలకు దగ్గరలో రైతుల పంట పొలాల్లో వాటర్ ప్యూరిఫయర్ ప్లాంట్ నిర్మాణానికి అధికారులు గుర్తించిన ప్రాంతం

పంటభూముల్లో.. అక్రమ నిర్మాణం!

పంటభూముల్లో వాటర్ ప్యూరిఫయర్ ప్లాంట్ నిర్మాణం అక్రమంగా చేపడుతుండడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రైతు భూ సమస్యలు పరిష్కరించాల్సిన అధికారులే నేరుగా ఈ చర్యకు ఉపక్రమించడం విచారకరం. మెంటిపేట వద్ద రైతులకు చెందిన 1.06 ఎకరాల్లో నీటిశుద్ధి కర్మాగారం నిర్మించేందుకు మున్సిపల్ అధికారులు సమాయత్తమయ్యారు. ప్రణాళికలు కూడా సిద్ధం చేశారు. అయితే ఎటువంటి నోటీసులు ఇవ్వకుండానే నిర్మాణం చేస్తుండడాన్ని అక్కడి రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇదేంటి సారూ అని అధికారుల తీరుపై మండిపడుతున్నారు.

రాజాం: పట్టణంలో మురుగునీటిని శుద్ధి చేసేందుకు వాటర్ ప్యూరిఫయర్ ప్లాంట్‌లు మంజూరయ్యాయి. వీటిని జనావాసాలకు దూరంగా, వార్డు శివారు ప్రాంతాల్లో ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే దానికి భిన్నంగా మున్సిపల్ అధికారులు వ్యవహరిస్తున్నారు. జనావాసాల దగ్గరే ఆ వాటర్ ప్లాంట్‌లను నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ప్రభుత్వ భూములు పలుచోట్ల ఆక్రమణల్లో ఉండగా, వాటిని పక్కనబెట్టి రైతులు సాగు చేసుకుంటున్న భూముల్లో ప్లాంట్ నిర్మాణం చేయడాన్ని అన్నదాతలు వ్యతిరేకిస్తున్నారు. తమ సమస్యలు పరిష్కరించాల్సిన అధికారులే ఇలా చేస్తే తమ గోడు ఇంకెవరికి చెప్పుకోవాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గతంలో ఇబ్బందులు లేకుండా..

గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోనే ఈ ప్యూరిఫయర్ వాటర్ ప్లాంట్లు మంజూరు కాగా, అటు ప్రజలకు, ఇటు రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్మాణాలు చేపట్టాలని అప్పటి పాలకులు అధికారులకు సూచించారు. అందుకు తగ్గట్టుగానే ప్రభుత్వ స్థలాలు గుర్తించారు. గాయత్రి కాలనీ, ఇందిరమ్మ కాలనీ, వాసవీనగర్, డోలపేట తదితర ప్రాంతాల్లోని స్థలాలపై అధికారులు ఆరా తీశారు. కొత్తగా కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆ ప్లాన్ మారింది. పట్టణంలోని పేదలపై అధికారుల దృష్టి మళ్లింది. దీంతో మెంతిపేట సమీపంలోని గోపాలపురం రెవెన్యూ పరిధిలో ఉన్న విలువైన రైతుల భూముల్లో వాటర్ ప్యూరిఫయర్ ప్లాంట్ నిర్మాణానికి అధికారులు ఎకరా ఆరు సెంట్ల స్థలాన్ని గుర్తించారు. ఈ స్థలం ఆ ప్రాంతానికి చెందిన అద్దంకి రమణ, చంద్రరావు, అద్దంకి సత్యారావు, వెంకటరావు, అద్దంకి శివప్రసాదరావు, దువ్వా తవుడు, మంజు తదితరులది. గోపాలపురం రెవెన్యూ పరిధిలో 105 సర్వే నంబరు 2ఏ, 2బీ, 2ఏ1 2ఏ2 తదితర సర్వే నంబర్లలో ఈ 1.06 ఎకరాల స్థలం ఉంది. ఇప్పటికీ రెవెన్యూ రికార్డుల్లో అద్దంకి సూర్యనారాయణ పేరు మీదనే ఈ భూమి ఉంది. ఈ భూమిని ప్రభుత్వానికి బదలాయించాలని ఇటీవల రాజాం తహసీల్దార్ ఎస్‌కే రాజు, మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు తదితరులు రైతుల వద్దకు వెళ్లి డిమాండ్ చేశారు. ఆ భూమి ఆధారంగానే తాము బతుకుతున్నామని, ఇప్పుడు ఆ భూమి తీసుకుంటే తామెలా బతకాలని రైతులు విలపించారు. ప్రభుత్వం నష్టపరిహారం ఇస్తుందని, సక్రమంగా వినుకోకుంటే పూర్తిగా నష్టపోతారని అధికారులు హెచ్చరించినట్లు రైతులు విలేకరుల వద్ద వాపోయారు. ఇటీవల కొంతమంది రైతులు కలెక్టర్‌ను కలిసి తమ భూములు లాక్కోవద్దని వినతిపత్రం కూడా అందజేసిన విషయం తెలిసిందే.

భూములు లాక్కుంటామంటున్నారు..



రాజాం మున్సిపల్ అధికారులు మాతో దురుసుగా వ్యవహరిస్తున్నారు. రెవెన్యూ అధికారులు వెటకారంగా మాట్లాడుతున్నారు. బలవంతంగా మా భూములు లాక్కుంటామంటున్నారు. ఆ భూమి మీదే ఆధారపడి జీవిస్తున్నాం. వారు తీసుకుంటే మేమెలా బతకాలి.

– అద్దంకి రమణ, రైతు, మెంతిపేట, రాజాం మండలం

చాలా అన్యాయం..



రాజాం పట్టణంలో వేల ఎకరాల్లో ప్రభుత్వ భూములు ఉన్నాయి. వాటిలో చాలా ఆక్రమణల్లో చిక్కుకున్నాయి. జనవాసాలకు దూరంగా ప్రభుత్వ భూములున్నా వాటిల్లో నిర్మాణాలు చేయకుండా తమ భూముల్లో చేయడం చాలా అన్యాయం. గతంలో ఎంఆర్‌సీ కాలనీకి, ప్రభుత్వ కాలనీలకు మా భూములు ఇచ్చి చాలా కోల్పోయాం. ఉన్న కొంచెం భూమిని వదులుకోలేం. అవసరమైతే కోర్టుకు వెళ్తాం.

– అద్దంకి వెంకటరావు, రైతు, మెంతిపేట, రాజాం మండలం

ప్రజల నుంచీ తీవ్ర వ్యతిరేకత..

మెంతిపేట జనావాసాల మధ్య రాజాం పట్టణ మురుగునీటిని శుద్ధి చేసేందుకు ఏర్పాటు చేయనున్న ప్యూరిఫయర్ వాటర్ ప్లాంట్ నిర్మాణంపై అక్కడి ప్రజల నుంచి కూడా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. పట్టణ శివారు ప్రాంతంలో ఈ ప్లాంట్ ఏర్పాటు చేస్తే వచ్చే శుద్ధినీటితో పంటలు పండించుకునే అవకాశం ఉంటుందని, ప్రజలకు సైతం ఎటువంటి హాని ఉండదని అంటున్నారు. ప్రజల మధ్య ప్లాంట్ ఉంటే దుర్వాసనతో పాటు కలుషిత వ్యర్థాల నుంచి ప్రమాదకర కీటకాలు ఉత్పత్తి అయి రోగాల బారినపడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు పవర్ వీడర్‌ల అందజేత



పవర్ వీడర్‌లు అందజేస్తున్న నాబార్డు డీడీఎం నాగార్జున

మెంటాడ: మండలంలోని లోతుగెడ్డ గ్రామంలోని రైతులకు రెండు పవర్ వీడర్(కలుపుతీసే యంత్రం)లు సోమవారం అందజేసినట్లు నాబార్డు డీడీఎం నాగార్జున తెలిపారు. రూ.20 వేల విలువైన ఆయా యంత్రాల సాయంతో పండ్లతోటల్లో నెలకొన్న కలుపుమొక్కలతో పాటు పండ్లమొక్కకు అల్లిన పాదు(పిచ్చిమొక్కలు)ను సులభంగా తొలగించవచ్చన్నారు. గంటన్నర కాలంలో ఎకరం పొలంలోని కలుపుమొక్కలు వీటితో తీయవచ్చన్నారు. ఇదిలా ఉండగా, బ్రెడ్స్ స్వచ్ఛంద సంస్థ ద్వారా పండ్లతోటల పెరుగుదలకు అవసరమైన ఎరువులు, గిరిజన యువతకు సబ్బులు, కొవ్వొత్తులు, షాంపుల తయారీలో శిక్షణా తరగతులు నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్, ఉపసర్పంచ్‌లు భీమారావు, నాయుడు, బ్రెడ్స్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు సుమన్, ఆదిత్య, శశి తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌ల వినతి..



వినతిపత్రం అందజేస్తున్న ఎంపీపీ సన్యాసినాయుడు, తదితరులు

మెంటాడ: ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే అభివృద్ధి పనులు, గోకులాల నిర్మాణానికి సంబంధించి వెండర్‌ను అధికార పార్టీ నాయకులు నిర్ణయించడాన్ని మండలంలోని సర్పంచ్‌లంతా వ్యతిరేకిస్తున్నారు. ఇదే విషయమై ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, పలువురు సర్పంచ్‌లు కలిసి మండల కేంద్రానికి సోమవారం వెళ్లి, ఎంపీడీవో కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. గ్రామపంచాయతీల్లో జరిగే అభివృద్ధి పనుల్లో సర్పంచ్‌లకే సర్వాధికారాలు ఉండేలా చూడాలని కోరారు. సర్పంచ్‌ల అధికారాల్లో అధికార పార్టీ నాయకుల జోక్యాన్ని నివారించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రాయిపిల్లి రామారావు, రాజప్పలనాయుడు, రత్నాకర్, లచ్చిరెడ్డి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ



బాడంగిలో విద్యార్థులకు సైకిళ్లు అందజేస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన, వీకే ట్రస్ట్ వ్యవస్థాపకుడు, డైరెక్టర్

బాడంగి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిరుపేదలైన విద్యార్థులకు ఎమ్మెల్యే బేబీనాయన చేతులమీదుగా సోమవారం సైకిళ్లు పంపిణీ చేశారు. అమెరికాకు చెందిన యూనివర్సల్ ఫ్యామిలీ(వసుధైక కుటుంబం) వారు చేసిన ఆర్థికసాయంతో వీకే ట్రస్ట్ వ్యవస్థాపకులు కొనుగోలు చేసిన 100 సైకిళ్లను విద్యార్థులకు అందజేశారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో దాతల సేవలను ఎమ్మెల్యే ప్రశంసించారు. దూరప్రాంతాల్లోని నిరుపేద విద్యార్థులకు ఇప్పుడు ఇచ్చిన సైకిళ్లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులు కూడా సైకిళ్లను చక్కగా వినియోగించుకుని, బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం దాతలను సత్కరించారు. ఇదే కార్యక్రమంలో జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో విజేతగా నిలిచిన కొట్టక్కి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థికి ఎమ్మెల్యే బేబీనాయన రూ.10 వేలను ప్రోత్సాహక బహుమతిగా అందజేసి, అభినందించారు. కార్యక్రమంలో వీకే ట్రస్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, ఎంపీటీసీ శ్రీనివాసరావు, సర్పంచ్ రమేష్, ఎంఈవోలు లక్ష్మణదొర, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తెర్లాం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పలువురు విద్యార్థులకు వసుధైక కుటుంబం అనే స్వచ్ఛంద సంస్థ వారు సైకిళ్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో త్రినాధరావు, ప్రధానోపాధ్యాయుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వెండర్ విధానం రద్దుకు డిమాండ్



సంతకవిటి: ఎంపీడీవో సురేష్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ జగన్‌మోహన్‌రావు, సర్పంచ్‌లు



తెర్లాం: ఎంపీడీవో రాంబాబుకి వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్‌లు, వైఎస్సార్ సీపీ నాయకులు



బొబ్బిలిరూరల్: బొబ్బిలిలో ఎంపీడీవో రవికుమార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న సర్పంచ్‌లు



రామభద్రపురం: సర్పంచ్‌లు అందిస్తున్న వినతి పత్రం స్వీకరిస్తున్న ఎంపీడీవో రత్నం

రామభద్రపురం/తెర్లాం/బొబ్బిలిరూరల్/సంతకవిటి/బాడంగి: ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన పనులను గ్రామ పంచాయతీల ద్వారా కాకుండా వెండర్ విధానం ద్వారా కాంట్రాక్టర్‌లతో చేయించడానికి ప్రభుత్వం చేస్తున్న సన్నాహాలపై సర్పంచ్‌లు, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు మండిపడుతున్నారు. ఉపాధి హామీ పథకం చట్టం ప్రకారం సర్పంచ్‌లే ఈ పనులు చేయాల్సి ఉండగా, కాంట్రాక్టర్లకు అప్పగించడంలో ఆంతర్యమేంటని ప్రశ్నిస్తున్నారు. కూటమి నాయకులకు ప్రజాధనం దోచిపెట్టడానికే వెండర్ విధానాన్ని అమలు చేసేందుకు చూస్తున్నారని విమర్శిస్తున్నారు. సర్పంచ్‌ల హక్కులు కాలరాస్తున్నారని, తక్షణమే వెండర్ విధానం రద్దు చేయాలని విజ్ఞప్తి చేస్తూ ఎంపీడీవోలకు సోమవారం వినతిపత్రాలు అందజేశారు.

జనావాసాల వద్ద మద్యంషాపులు వద్దు



బాడంగి: ఎమ్మెల్యే బేబీనాయనతో మాట్లాడుతున్న మహిళలు

బాడంగి: మండల కేంద్రంలోని మెయిన్‌రోడ్డు పక్కన జనావాసాల వద్ద మద్యంషాపులు ఏర్పాటు చేయడాన్ని అక్కడి మహిళలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. మండల కేంద్రానికి సోమవారం విచ్చేసిన ఎమ్మెల్యే బేబీనాయనను స్థానిక మహిళలు కలిసి తమ గోడు వినిపించారు. జనావాసాల మధ్య దుకాణాలు ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థులు, యువత చెడిపోయే ప్రమాదం ఉందని, మహిళల పట్ల తాగుబోతులు అసభ్యకరంగా ప్రవర్తించే ఘటనలు జరగవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. జనావాసాలకు దూరంగా దుకాణాలు ఏర్పాటు అయ్యేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అయినా ఎమ్మెల్యే నుంచి ఎటువంటి భరోసా రాకపోవడంతో నిరాశతో మహిళలు అక్కడి నుంచి వెళ్లిపోవాల్సి వచ్చింది.

బొబ్బిలి: నూతన మద్యం పాలసీ నిబంధనలకు వ్యతిరేకంగా మద్యం దుకాణాల ఏర్పాటు చేస్తుండడం దారుణమని మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు అన్నారు. ఇదే విషయమై మండల కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలోని తన చాంబర్‌లో విలేకరులతో ఆయన సోమవారం మాట్లాడారు. జనావాసాలు, రద్దీ ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో మద్యం దుకాణాలు ఏర్పాటు చేయడం పట్ల మహిళలు, స్థానికుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నా ప్రభుత్వం గానీ అధికారులు గానీ పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. మేదరిబంద వద్ద కొన్నిరోజులుగా అక్కడి మహిళలు నిరసన తెలుపుతున్నా అక్కడే షాపును కొనసాగిస్తున్నారన్నారు. అలాగే తాండ్రపాపారాయుడి విగ్రహానికి ఎదురుగా మద్యం దుకాణం ఏర్పాటు చేసి, ఆయనను అవమానపరిచారన్నారు. కూటమి ప్రభుత్వ కుటిల రాజకీయాలకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. ఆయన వెంట మున్సిపల్ కౌన్సిలర్లు ఇంటి గోవిందరావు, సవలాపురపు రామకృష్ణ తదితరులు ఉన్నారు.


రెవెన్యూ సదస్సు

రేగిడి: మండలంలోని వావిలవలస గ్రామంలో రెవెన్యూ సదస్సు సోమవారం నిర్వహించారు. తహసీల్దారు ఎల్లారావు తదితరులు కలిసి భూ సమస్యలకు సంబంధించిన పలు అర్జీలను రైతుల నుంచి స్వీకరించారు. భూ సమస్యల పరిష్కారానికే ఈ సదస్సులు నిర్వహించడం జరుగుతోందని, రైతులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అలరించిన హరిదాసు సంకీర్తనలు

రాజాం: ఏకాదశి పురస్కరించుకుని, స్థానిక పట్టణంలోని మల్లిఖార్జునకాలనీలో ఉన్న శివాలయం వద్ద సోమవారం చేపట్టిన హరిదాసు సంకీర్తనలు అలరించాయి. హైదరాబాద్‌కు చెందిన మానం శివదండాశి హరిదాసు.. శివపార్వతుల కల్యాణంపై కీర్తనలు ఆలపించి, ఆకట్టుకున్నారు. అనంతరం హరిదాసును ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్తులు సత్కరించారు.


154 యూనిట్ల రక్తం సేకరణ



రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

బొబ్బిలి: పోలీస్ అమరవీరుల సంస్మరణ దినంలో భాగంగా స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరానికి హాజరైన దాతల నుంచి మొత్తం 154 యూనిట్ల రక్తం సేకరించినట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం దాతలకు డీఎస్పీ పి.శ్రీనివాసరావు, సీఐ కె.సతీష్‌కుమార్ చేతులమీదుగా సర్టిఫికెట్లు అందజేశారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు



మాట్లాడుతున్న ఎంపీపీ సురేష్‌ముఖర్జీ

వంగర: గ్రామాల్లో మలేరియా, టైఫాయిడ్, డెంగీ, డయేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయితీ కార్యదర్శులతో సోమవారం సమావేశమైన ఆయన.. పారిశుద్ధ్య వారోత్సవాల్లో భాగంగా గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని, క్లోరినేషన్ చర్యలు చేపట్టాలని తెలిపారు. ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలంతా బృందాలుగా ఏర్పడి, గ్రామాల్లో ఫీవర్ సర్వే ద్వారా రోగులను గుర్తించి, వారికి సకాలంలో వైద్యసేవలు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో లోపింటి త్రినాద్, ఈవోపీఆర్డీ కెల్ల రామారావు తదితరులు పాల్గొన్నారు.

సక్రమంగా అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీవో రాజ్యలక్ష్మి

తెర్లాం: మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలను కార్యకర్తలంతా సక్రమంగా నిర్వహించాలని ఐసీడీఎస్ బాడంగి ప్రాజెక్ట్ పీవో కె.రాజ్యలక్ష్మి సూచించారు. స్థానిక మూడో అంగన్‌వాడీ కేంద్రంలో తెర్లాం సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్తలతో సూపర్‌వైజర్ ఉషారాణి ఆధ్వర్యంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన పీవో కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్న ప్రీస్కూళ్లలో చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను అందించాలని, మెనూ ప్రకారం ప్రతిరోజూ పౌష్టికాహారం పెట్టాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రం పరిధిలోని పిల్లల బరువులు, ఎత్తులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. కేంద్రానికి సంబంధించిన అన్ని రికార్డులు సక్రమంగా నిర్వహించాలన్నారు. సమావేశంలో తెర్లాం సెక్టార్ సూపర్‌వైజర్ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

సంతకవిటి: రాష్ట్ర స్థాయి పోటీల్లో మండలంలోని సిరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని జి.మేఘన విశేష ప్రతిభ కనబరిచింది. ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు కర్నూలు జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో మేఘన పాల్గొని 400 మీటర్ల హర్డిల్స్ రన్నింగ్, 100 మీటర్ల రిలే రన్నింగ్‌లోనూ ద్వితీయ స్థానంలో నిలిచినట్లు హెచ్‌ఎం వి.వెంకటరావు తెలిపారు. ఈ మేరకు సదరు విద్యార్థినిని పాఠశాల సిబ్బంది అభినందించారు.

కాలుష్యం లేకుండా చర్యలు

రేగిడి: మండలంలోని సంకిలి వద్ద ఈఐడీ సుగర్ ఫ్యాక్టరీ కారణంగా చుట్టుపక్కల ప్రాంతాల వారికి ఎటువంటి కాలుష్య ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నామని కర్మాగారం ఏవీపీ పట్టాభిరామిరెడ్డి అన్నారు. సోమవారం ఫ్యాక్టరీ పరిసర ప్రాంతమైన చిన్నయ్యపేట గ్రామానికి వెళ్లి, అక్కడి ప్రజలతో కాసేపు మాట్లాడారు. కర్మాగారం నుంచి వస్తున్న వ్యర్థాలతో ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఆధునిక పద్ధతులు పాటిస్తున్నామని తెలిపారు. వీటి వలన ఎటువంటి కాలుష్యం ఉండదని స్పష్టం చేశారు. గ్రామానికి అవసరమైన మౌలికసదుపాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో కేన్ డీజీఎం రమేష్ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందించాలి



విద్యార్థుల కోసం సిద్ధం చేసిన టీఎల్‌ఎంను పరిశీలిస్తున్న ఎంఈవో దుర్గారావు

వంగర: విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని ఎంఈవో వై.దుర్గారావు సూచించారు. మండలంలోని కింజంగి గ్రామ ప్రాథమిక పాఠశాలను సోమవారం సందర్శించిన ఆయన.. రికార్డుల నిర్వహణ, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పరిశీలించి, పలు సూచనలు చేశారు. లెస్సన్ ప్లాన్, టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్(టీఎల్‌ఎం) ఆధారంగా ఉపాధ్యాయులు విద్యాబోధన చేయాలని, చదువులో వెనుకబడిన విద్యార్థుల విద్యాప్రగతిపై దృష్టిసారించాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వంగర: స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు వినూత్నంగా బోధిస్తున్నారు. ఖాళీ సమయంలో విద్యార్థులకు టెలివిజన్ ద్వారా నీతికథలను పాఠ్యాంశాల రూపంలో వినిపిస్తున్నారు. ఉపాధ్యాయుడు సామంతుల మల్లేశ్వరరావు ప్రత్యేక చొరవతో విద్యార్థులకు ఇలా బోధించడాన్ని అందరూ ప్రశంసిస్తున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు



రాజాం: మందుగుండు సామగ్రి దుకాణాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో సత్యవాణి



బొబ్బిలి ఫ్లైఓవర్ దిగువన ఏర్పాటు చేసిన బాణసంచా విక్రయ దుకాణాలు

బొబ్బిలిరూరల్: బాణసంచా విక్రయాల్లో నిబంధనలు అతిక్రమిస్తే సంబంధిత వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ హెచ్చరించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆర్డీవో మోహనరావు, తహసీల్దారు ఎం.శ్రీను, మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి, ఎంపీడీవో పి.రవికుమార్‌లతో సోమవారం సమావేశమైన ఆయన.. మందుగుండు సామగ్రి దుకాణాలను జనావాసాలకు దూరంగా ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని, అలాగే అధిక ధరలకు క్రాకర్స్ అమ్మకుండా చూడాలన్నారు. అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న దుకాణాలను సీజ్ చేయాలని సూచించారు.

ఆర్డీవో పరిశీలన..

రాజాం సిటీ: దీపావళి సామగ్రి విక్రయిస్తున్న వారంతా తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని చీపురుపల్లి ఆర్డీవో సత్యవాణి సూచించారు. మండలంలోని పెనుబాక గ్రామ సమీపంలో ఉన్న శాశ్వత మందుగుండు సామగ్రి దుకాణాలను ఆమె సోమవారం పరిశీలించారు. అనంతరం తాత్కాలికంగా ఏర్పాటు చేయనున్న మందుగుండు దుకాణాల స్థలాలను పరిశీలించి, సంబంధిత యజమానులకు పలు సూచనలు చేశారు. ఎటువంటి ప్రమాదం జరగకుండా ఉండేలా అన్ని ఏర్పాట్లు చేయాలని తెలిపారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమె వెంట తహసీల్దారు ఎస్‌కే రాజు తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు రాకముందే వెలసిన దుకాణాలు

బొబ్బిలి: ఎటువంటి అనుమతులు రాకముందే స్థానిక పట్టణంలోని ఫ్లైఓవర్ తదితర ప్రాంతాల్లో బాణసంచా దుకాణాలు ఏర్పాటు కావడం పలు అనుమానాలకు తావునిస్తోంది. దీపావళి పండగ నేపథ్యంలో మందుగుండు సామగ్రి అమ్మకాల నిమిత్తం వ్యాపారులు ఎవరైనా అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. అయితే అవేమీ జరగకుండానే పట్టణ పరిధిలోని పలుచోట్ల మందుగుండు సామగ్రి అమ్మకాల కోసం దుకాణాలను పలువురు ఏర్పాటు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ఎవరి దుకాణాలకు అనుమతులు వస్తాయో ముందుగానే తెలుసు అన్నమాటలు వినిపిస్తున్నాయి. కూటమి నేతల కనుసన్నల్లోనే క్రాకర్స్ దుకాణాలు కూడా వారి నేతలు, కార్యకర్తలకు దక్కుతున్నాయన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

రాజాం: పట్టణంలోని పలు బాణసంచా షాపుల్లో ఫైర్ అండ్ సేఫ్టీ మేనేజ్‌మెంట్ రాజాం ఎస్‌ఐ టీఎస్ జనార్ధనరావు తనిఖీలు నిర్వహించారు. ఫైర్ సేఫ్టీ పద్ధతులు పాటించాలని, నిబంధనల మేర అమ్మకాలు చేయాలని సూచించారు.